**కామెడీ కథ**

# చాదస్తం మొగుడు



**డా.కొఠారి వాణీ చలపతిరావు**

**ఒక పద్ధతి, నియమం, నిష్ఠ, ఆచారం ఇవి ఏవయినా, అవి ఎంత మంచివే అయినా మోతాదును మించి ఓవర్ అయిపోతే అది చాదస్తంగా రూపాంతరం చెందుతుందని అనుభవం మీద ఇప్పుడు నాకు బాగా అర్థం అయిపోయింది. ఇంతకు ముందు నా చిన్నతనంలో మా బామ్మ చాదస్తం, ఇప్పుడు మావారి చాదస్తం చూస్తూ వుంటే ఈ చాదస్తాలలో ఎన్ని వెరయిటీస్ వుంటాయో, వేటి స్థాయి ఏదో కూడా క్షుణ్ణంగా తెలిసిపోయింది.**

మా బామ్మది 'నిప్పులు కడిగే ఆచారం' అనుకునే వాళ్ళు అందరూ ఆరోజుల్లో. అంతటి ఆచారంలోనూ అప్పుడప్పుడూ కనిపించే అమాయకత్వం, మూఢత్వం మాకు నవ్వు తెప్పించేవి. తడిపి ఆరేసిన మడిచీర కట్టుకుని 'తాకుతావ్-తాకుతావ్' అంటూ ఎవరు పక్కకు వచ్చి నిల్చున్నా ఆతపత్రంలా ముడుచుకుపోయేది. ఆవిడను ఆ సమయంలో 'ముట్టుకుంటా..ముట్టుకుంటా..' అంటూ ఆటపట్టిస్తూ మీదిమీదికెళ్ళడం ఎంత సరదాగా వుండేదో. అప్పుడు బానంత నోరు పెట్టుకుని తిట్టినతిట్టు తిట్టకుండా తిడుతుంటే పడిపడి నవ్వేవాళ్ళం పిల్లలమంతా. బావిలోంచి నీళ్ళు స్వయంగా తోడుకుని, బిందె చంకన పెట్టుకుని..నీళ్ళు చల్లుతూ నడిచే దారినంతా శుద్ధి చేసుకుంటూ ఇంట్లోకి వెళ్ళేది.

"మేం నడిస్తే నేల కూడా మైల పడిపోయిందా బామ్మా?" అని నేనంటే "నువ్వు చిలకరించిన నాలుగు నీటి చుక్కలతో నేల కూడా మడికట్టుకుందా బామ్మా" అని తమ్ముడు అనేవాడు. రాత్రి పడుకోబోయేముందు చింకిచాప, ఓటికుండ, పగిలిన బొచ్చె సైతం తెచ్చి ఇంట్లో పడేసే బామ్మ...అంట్లగిన్నెలను, తన ఆరేసిన 'మడి'చీరను మాత్రం బయటే వుంచి 'దొంగ వెధవ వాటిని ముట్టుకోలేడుగా' అంటుంటే ఆ అమాయకత్వానికి బోలెడు జాలి కలిగేది. అనుకున్నట్టుగానే ఓరోజు ఓ దొంగ ఆ చీరను చంకన, అంట్ల గిన్నెలు నెత్తిన పెట్టుకుని ఉడాయిస్తే బోలెడు ఆశ్చర్యపోతూ 'అంట్ల వెధవ, అప్రాచ్యపు వెధవా' అంటూ పిచ్చితిట్లు తిట్టింది ఆ దొంగను.

బామ్మ 'విస్తరి భోజనం' చేసేది. నేలమీదే కొంగు పరుచుకుని పడుకునేది. మమ్మల్ని అంటరానివాళ్ళుగా చూసేది. ఇక పనివాళ్ళనయితే ఇంట్లో అడుగుపెట్టనివ్వకుండా, ఏ వస్తువునూ ముట్టనివ్వకుండా పురుగుల్ని చూసినట్లు చూసేది. "వయసు పెరుగుతున్నకొద్దీ నీకు చాదస్తం ఎక్కువవుతోందే అమ్మా...ఈరోజుల్లో కూడా ఇంకా ఈ పద్ధతులేమిటి?" అని బామ్మను నాన్న విమర్శిస్తే..ఆ కోపం నా మీద చూపి అనవసరంగా నన్ను చీవాట్లు పెట్టేది. "ఎంగిలి కంచం ఎత్తిన దానివి శుద్ధి పెట్టాల్సిన అవసరం లేదా? నీకు బొత్తిగా జ్ఞానం లేకుండా పోతోంది. రేపు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళవలసిన ఆడపిల్లవు. మడి, ఆచారంగల కొంపలో పడితే ఇంకేమయినా ఉందా...కని అలా వదిలేసినందుకు మీ అమ్మను, ఆచార వ్యవహారాలు నేర్పనందుకు ఇంటి పెద్దదాన్నయిన నన్నూ చీవాట్లు పెడతారు" అనేది.

దాంతో నాకు లోపలినుంచి రోషం తన్నుకుని వచ్చేది.

"నేను చదువుకుని ఉద్యోగం చేసే మొగుడ్ని చేసుకుంటాను. అప్పుడు ఎలాగూ వేరు కాపురం పెట్టాలి గనుక అత్తగార్లూ, నీలాంటి ముసలమ్మల బాధలు నాకు వుండవు" అని ఎదురు సమాధానం చెప్పేదాన్ని. బామ్మ బుగ్గలు నొక్కుకుంటే ఇంట్లో అందరూ ముసిముసి నవ్వులు నవ్వేవాళ్ళు నా మాటలకు.

ఆరోజు బామ్మకు అంత ధీమాగా సమాధానం చెప్పిన నేను చెప్పినట్టుగానే పెద్ద ఉద్యోగం చేస్తున్న మొగుడ్ని చేసుకుని సిటీలో ఓ పెద్ద ఫ్లాట్‌లో వేరుకాపురం పెట్టాను.

కానీ- కొద్దిరోజుల కాపురం తర్వాత తెలిసింది. ఆయనకూ చాదస్తం ఉందని! అయితే అది బామ్మ లాంటి చాదస్తం కాదు..మరో టైపుది. అప్పుడే మొదటిసారి నాకు అర్థమయింది చాదస్తాలలో పలురకాలు వుంటాయని. బామ్మది బోడితల, తెల్లచీర, చేతిలో రుద్రాక్షమాల గెటప్ చాదస్తం అయితే...మా ఆయనది లుంగీ కట్టు, మీసకట్టు, అందమైన తలకట్టు, నోరువిప్పితే ఇంగ్లీషు గెటప్‌లో మరో మోడర్న్ చాదస్తం.

ఏ అప్పడాలకర్ర అయితేనేం తల బొప్పి కట్టడానికి!

ఏ రకం చాదస్తం అయితేనేం..మన సహనాన్ని ఓపి కను పరీక్షించి మనల్ని విసిగించటానికి..దొందూ దొందే!

★ ★ ★

"అవంతీ ముఖం కడుక్కున్నావా?" పక్కమీద నుంచి లేవగానే నన్ను మావారు అడిగే మొదటి ప్రశ్న అది. దాని తాత్పర్యం 'బ్రష్ చేసుకున్నావా?' అని. ఇది అడగాల్సిన ప్రశ్నేనా? ఎవరయినా నిద్రలేస్తూ 'గుడ్‌మార్నింగ్' చెబుతూ లేస్తారు గానీ..'ముఖం కడుక్కున్నావా..టాయిలెట్‌కెళ్ళావా?' అని ప్రశ్నిస్తూ లేస్తారా? ఆయన అంతే...చెపితే వినరు. మొదట్లో చెప్పి చెప్పి విసుగెత్తి ఇప్పుడు చెప్పటం కూడా మానేసాను. పైపెచ్చు ఆ ప్రశ్నకు, ఆ ధోరణికి నేను కూడా అలవాటుపడిపోయాను. ఆయన అడిగిన ప్రశ్నకు నేను సమాధానం చెప్పే అవసరం లేకుండానే పాఠం మొదలవుతుంది.

"పళ్ళు తోముకోవటానికి ఓ పద్ధతి అంటూ వుంది. బ్రష్ చేతిలోకి తీసుకోగానే ముందు దాన్ని శుభ్రంగా కడగాలి..లేకుంటే రాత్రంతా దాని మీద పడిన దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా అలాగే వుండిపోతాయి. బ్రష్ మీద పేస్టు వేసుకుని పళ్ళ చిగుళ్ళ వరకు, దవడల మూలలకు పోయేలా సున్నాలు..సున్నాలుగా దాన్ని తిప్పుతూ కడుక్కోవాలి. గిన్నెలోని కూరను గరిటె పెట్టి పైపైన అలా తిప్పినట్టు కాదు" అంటూ అలా సాగిపోతూనే వుంటుంది ఆ పాఠం. ఆ తరువాత పళ్ళు అరిగిపోయేలా..రుబ్బురోలులా పళ్ళు తోముకునే కార్యక్రమం ముగిస్తారు. ఆ తరువవాత 'యా..ఖా..ధూ..' వంటి భయంకరమైన..రాక్షసారావాలు చేస్తూ చుట్టుపక్కల వాళ్ళనందరినీ భయపెట్టేస్తారు..దాన్ని టంగ్ క్లీనింగ్ అంటారట ఆయన భాషలో. ఉదయాన్నే ఆయన చేసే అలాంటి భీకర ధ్వనులు మా చుట్టుపక్కల వాళ్ళకు కూడా వినీ వినీ అలవాటైపోయాయి. కొత్తలో ఒకటి రెండుసార్లు పరుగెత్తుకుంటూ వచ్చారు ఏమయిందోనని. ఇప్పుడు రావటం లేదు. మా పక్క ఫ్లాట్‌లోని నిత్య బాలింత మాత్రం 'మా పిల్లలు దడుసుకుంటున్నారు మీవారి ముఖప్రక్షాళన కార్యక్రమానికి..కొంచెం వాల్యూమ్ తగ్గించమనరా ప్లీజ్!' అని రిక్వెస్ట్ చేస్తూ ఉంటుంది ఇప్పటికీ!

"కాఫీలో నికోటిన్ వుంటుంది. అది వంటికి మంచిది కాదు. ఇద్దరం రోజూ పాలే తాగాలి" అంటూ ఇంటికి కాఫీ పొడి తేవటం మానేసారు ఆయన. నాకు పొద్దున్నే కాఫీ తాగకపోతే తిక్కతిక్కగా వుంటుంది. మా అమ్మ చిక్కటి ఫిల్టర్ కాఫీ చేసి చేతికందిస్తే ఒక్కొక్క గుటకగా దాని రుచిని ఆనందిస్తూ అనుభవించటం నాకు అలవాటు.

చెపితే వినరు కదా! తన మాటే తనది!

ఇదొక్కటేనా? కడుపుచించుకుంటే కాళ్ళ మీద పడుతుంది.

నేను కాబట్టి భరిస్తున్నాను ఆ మనిషిని.

ఓ సినిమా లేదు. ఓ సరదా లేదు. ఓ సరసం లేదు. కనీసం ఓ రొమాంటిక్ లుక్ కూడా లేదు. ఆయన మనసు, చూపు, ఎప్పుడూ మూలనున్న చీపుర్ల మీద...అరుగుమీద వున్న అలుగ్గుడ్డలమీద, అటక మీద వున్న బూజుమీద..సాలె గూడులమీద...అంతే!

అటొచ్చి, ఇటొచ్చి..వంటింట్లోకి తొంగి చూస్తారు.

"ఆ టేబులు తుడిచే బట్ట అక్కడెందుకు పెట్టావ్? ఆ ఎంగిలికంచం అక్కడెందుకుంది...ఎప్పటికప్పుడు కడిగెయ్యవా? నాప్‌కిన్స్ చక్కగా ఉతికి డెట్టాల్ వాటర్‌లో పిండి ఆరేస్తున్నావా లేదా?" అంటూ యక్షప్రశ్నలు వేస్తారు. "సింక్ శుభ్రంగా కడుగుతున్నావా లేదా? బ్యాక్టీరియా చేరి...అవి ఆహార పదార్థాలలో కలిసిపోయాయంటే రోగాలొస్తాయి" అంటూ నా సహనానికి ఓ పరీక్ష పెడుతూంటారు.

ఉదయంవేళ కిచెన్‌లో అసలే ఊపిరి సలపని పనితో బిజీగా వుంటానేమో..వళ్ళు మండిపోతుంటుంది ఆ మాటలకు.

"అంత అనుమానమయితే ప్రతి పనీ మీరే చేసుకోండి. వంట వచ్చిన మొగుడ్ని భరించటం కష్టం అంటారు గానీ..ఇలా మీలా ప్రతి పనిలోనూ వంకలు పెడుతూ విమర్శించే మొగుడ్ని కూడా భరించడం కష్టమే..రేపటినుంచీ నేను ఒక్క పనీ చేయను. ఆఫీసు మానేసి చీపురు పట్టుకుని ఇల్లు శుభ్రం చేస్తూ కూర్చోండి. కావాలంటే నేను ఉద్యోగం చేసి మీకు సంపాదించి పెడతాను" అనగానే కంగారుపడిపోయి అప్పటికి అవతలకెళ్ళిపోయారు మావారు.

అజమాయిషీ చెలాయించడం, ఉచిత సలహాలివ్వడం తప్ప పనిచేయడం అంటే ఒంటికి పడదు ఈ మగవాళ్ళకు. మావారూ అందులో మినహాయింపు కాదు. పైపెచ్చు ముందువరసలో వుంటారు. అందుకే ఆ పలాయనం! అయినా ఏం లాభం? అంతలోనే అన్నీ మర్చిపోయి స్నానం చేసి..వచ్చి, డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని ఏయే ఆహారపదార్థాలలో ఎంత బలవర్ధక పదార్థాలున్నాయో, ఏ విటమిన్లు వున్నాయో, ఏది ఎన్ని క్యాలరీలో..వంటి విషయాల మీద లంబా చౌడా లెక్చర్లివ్వటం మొదలుపెట్టారు ఒక్క పక్క టిఫిన్ తింటూనే.

ఆయన అలా ఆఫీసుకు వెళ్ళడం ఆలస్యం నాకు కాస్త ఆటవిడుపు దొరికినట్టయింది. టేప్ రికార్డర్ ఆన్ చేసి ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి పాటలను

## అందాలవిందు

**అం**దాలతారలిద్దరూ కలిసి నటిస్తే నేత్రానందమే. సెక్సీతార బిపాషాబసు రాజ్‌కన్వర్ కొత్త చిత్రం 'హమ్‌కో దీవానా కర్‌గయా'లో కత్రినాకైఫ్‌తో కలిసి నటిస్తోంది. ఫిల్మ్‌సిటీన్ స్టూడియోలో ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైన ఈ చిత్రంలో కత్రినా, బిపాషా అందాలు ప్రేక్షకుల్ని కనువిందుచేయనున్నాయి. కొత్తదనంతో కూడిన కథకి తగ్గట్టు ఇరువురు అందాల హీరోయిన్లని ఎంపికచేయడంలో దర్శకుడు రాజ్‌కన్వర్ ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. ఈ ఇరువురు భామల అందాలు ప్రేక్షకుల హృదయాన్ని ఎలా కొల్లగొడతాయో చూడాలి మరి!



వింటూనే కొత్తగా కొన్న నా చీరమీద ఎంబ్రాయిడరీ చేసుకున్నాను.

పెయింటింగ్స్ అంటే నాకు ప్రాణం. వాటిని చూడటం, వెయ్యటం కూడా ఇష్టం. నిన్న మధ్యలో ఆగిపోయిన పెయింటింగ్‌ను చేతిలోకి తీసుకుని మొత్తానికి 'పండుటాకు' అని పేరు పెట్టిన వృద్ధుని చిత్రాన్ని పూర్తి చేసాను. పదే పదే చూసుకొని మురిసిపోయాను.

జీవితంలో నాకు తీర్చుకోవాల్సిన కోర్కెలు ఎన్నో వున్నాయి. కానీ ఒక పట్టాన తీరవు అవి. ఆయనకు చెప్పీ లాభం ఉండదు.

బాలమురళీకృష్ణ క్యాసెట్స్ కొనుక్కురండి అంటే 'అవెందుకు దండగ' అంటూ 'బూజుకర్రలు కొత్తరకంవి వచ్చాయి' అంటూ అవి కొనుక్కొచ్చారు ఓ రోజు.




"చలం సాహిత్యం తెచ్చిపెట్టండి" అని అడిగితే, "అందులో అంతా బూతు వుంటుందట...అదెందుకు" అంటూ 'శుచీ శుభ్రతా' అనే పుస్తకంతోపాటు 'ఆరోగ్యానికి ఆరుసూత్రాలు' అనే పుస్తకం కూడా తెచ్చారు మరో రోజు.

"ఒక్కసారి నా పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్ పెట్టుకుంటానండీ. సహకరించరా ప్లీజ్!" అని ఎంత దీనంగా ఎన్నిసార్లు అడిగినా "నీ పిచ్చి బొమ్మల్ని చూడటానికి ఎవరు వస్తారు...నీ పిచ్చిగానీ" అంటూ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్ళి ఎక్వాగార్డ్ వాటర్ ఫిల్టర్, వేక్యూమ్ క్లీనర్, కొత్తరకం జెట్ మ్యాట్స్ ముందు గంటలకొద్దీ నన్ను నిలబెట్టి ఈసారి తను కాక మరెవరితోనో పాఠాలు చెప్పించారు. 'ఈ చాదస్తం మొగుడితో ఎలా వేగాలిరా భగవంతుడా' అని తలపట్టుకుని కూర్చోవటమే నా వంతు పని అయింది.

* * *

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి లేట్‌గా ఇంటికొచ్చారు మావారు. వస్తూనే "డాక్టర్ దగ్గరికి వెళ్ళొచ్చాను" అన్నారు.

"ఎందుకు?" అన్నాను కంగారుగా.

"ఎందుకేమిటి నీ మొహం. జనరల్ చెకప్కు"

"ఈ వయసులోనే జనరల్ చెకప్?"

"చేయించుకోవాలి..నీకు తెలియదు..రోగాలకు వయసుతో సంబంధం లేదు. అందుకే ముందు జాగ్రత్త అవసరం"

"ఏం చెప్పారు డాక్టర్?"

"అన్ని టెస్ట్‌లూ చేసి అంతా బాగానే ఉందన్నారు. కానీ ముందు ముందు బి.పి. రాకుండా వుండటానికి, షుగర్, గుండెజబ్బులు శరీరంలో ప్రవేశించకుండా వుండటానికి ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోమన్నాడు. వంట్లో కొవ్వు చేరకుండా వుండటానికి మితంగా ఆహారం తీసుకోమన్నాడు. కొలస్ట్రాల్ పెరిగితే గుండెకు హాని గనుక, నూనె, నెయ్యి బాగా తగ్గించమన్నాడు. తీపి పదార్థాలను విషప్రాయంగా చూడమన్నాడు" ప్రవాహంలా సాగిపోతోంది మావారి వాగ్ధోరణి. దానికి కాస్తంత అడ్డుకట్ట వేస్తూ-

"మరి ఏం తినాలట?" అని అడిగాను.

"చెప్తా..చెప్తా..ఆ విషయానికే వస్తున్నా. పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్‌లో మొలకెత్తిన పెసలు తినమన్నాడు. మధ్యాహ్నం ఓ చిన్నగిన్నెడు అన్నం..రెండు పుల్కాలు తినమన్నాడు. మళ్ళీ రాత్రికి రెండు చిన్న చిన్న పుల్కాలు..నీళ్ళ మజ్జిగ..ఇవిగాక అదనంగా అప్పుడప్పుడూ పచ్చికూరలు, పండ్లు తినమన్నాడు. ఇదిగో బజారు నుంచి వస్తూ కూరలు, పండ్లు తెచ్చాను. ఈ రాత్రికి రెండు పుల్కాలు చేసి ఒక కీరా, టమాటా కోసిపెట్టు. పెసలు నీళ్ళలో నానబొయ్యి రేపటికి" అన్నారు తెగ ఆసక్తిని, ఆవేశాన్ని చూపిస్తూ.

మౌనంగా అన్నీ విన్నాను. రాత్రి భోజనం కోసమని వండిన అన్నం ఏం చేయాలో అర్థం కాలేదు. 'రేపు పనిమనిషి పంటపండింది' అని మనసులో అనుకుంటూ వుండగా ఆయన కొసమెరుపుగా "ఇప్పుడు నేను చెప్పిన ఈ ఆరోగ్య సూత్రాలన్నీ నా ఒక్కడి కోసం కాదు..నీకోసం కూడా. నువ్వు ఈమధ్య వెయిట్ పెరిగావు..అది మంచిది కాదు" అనగానే నాకు వళ్ళు మండింది.

"పట్టుమని నాకు పాతికేళ్ళు కూడా లేవండీ. ఇంకా పిల్లల్ని కనాలి..వాళ్ళను

## పెరిజాద్ ఆనందలహరి

సీనియర్ తారలతో నటిస్తే ఎంతో కొంత నేర్చుకోవచ్చు అంటోంది పెరిజాద్ జొరాబియన్. 'ఏక్ అజ్‌నబీ' చిత్రంలో నటిస్తున్న ఈ భామ ఇప్పటివరకూ షూటింగ్స్‌తో బిజీగా ఉంది. అమితాబ్, అర్జున్ రాంపాల్‌తో కలిసి నటిస్తున్న పెరిజాద్ ఈ చిత్రం షూటింగ్ పూర్తి కావడంతో బిజీ తగ్గి హాయిగా ఉంది. కొత్త ఆఫర్ల కోసం ఎదురుచూస్తోంది. 'అమితాబ్‌తో కలిసి నటించాలన్న నా కోరిక ఈ చిత్రంతో తీరింది' అంటోంది ఆనందంగా పెరిజాద్.



పెంచి పెద్దచేయాలి. బోలెడు బరువులు, బాధ్యతలు ఉన్నాయి భవిష్యత్తులో" అన్నాను.

"అయితే ఏంటి..బోలెడు బాధ్యతలు ముందున్నాయని వంటి బరువును ఇష్ట మొచ్చినట్టు పెంచేస్తావా ఇప్పుడు. ఒక సారి వళ్ళొచ్చిందంటే తగ్గటం చాలా కష్టం. అన్నట్టు డాక్టరు రోజూ ఓ అర గంట అయినా వాకింగ్ చెయ్యమన్నాడు. పద పద వాకింగ్ చేద్దాం" లేడికి లేచిందే పరుగన్నట్టు తొందరపెట్టారు ఆయన.




నాకు ఇంట్లోనే బోలెడు వాకింగ్ అవుతుంది. ఆయనే అస్సలు కాలు కింద పెట్టరు. మంచం మీద నుంచి కేన్ కుర్చీలోకి, అక్కడినుంచి సోఫాలోకి, అక్కడినుంచి మారుతీ ఎయిట్ హండ్రెడ్‌లోకి మారుతుంటారు అంతే. అయినా 'వాకింగ్' అనగానే నాకు ఉత్సాహంగానే అనిపించింది. ఆరోగ్యం మాట అటుంచి వాకింగ్ పేరుతో నా అవసరాలన్నీ నేనే స్వయంగా తీర్చుకోవచ్చు. క్యాసెట్స్, రంగులు, కుంచెలు అన్నీ కొనుక్కోవచ్చు అనుకుని చకచకా తయారయ్యాను. కానీ ఆయన నన్ను ఒకచోట ఆగనిస్తేనా? "వాకింగ్ అంటే షాపింగ్ కాదు. అడుగులో అడుగేస్తూ పెళ్ళినడకలు నడవటం కాదు. చేతులు ఇలా ఊపుకుంటూ పెద్ద పెద్ద అంగలతో స్టిఫ్‌గా నడవాలి. వాకింగ్ మీద తప్ప ఆ సమయంలో మరో విషయం మీద ధ్యాస ఉండకూడదు" అన్నారు.

అలాగే నడిచాం ఇద్దరం. ఇంతలో ఎదురుగా వస్తున్న ఆయన మిత్రుడు ఒకడు మావారినుద్దేశించి "ఏంటీ సతీసమేతంగా యుద్ధానికి బయలుదేరావు" అని జోకారు. నాకు సిగ్గనిపించి దాన్ని కవర్ చేసుకోవటం కోసం "బాగున్నారా అన్నయ్యగారూ!" అంటూ మాటల్లో పెట్టబోయాను. అందుకు అవకాశం ఇవ్వకుండా "వాకింగ్ చేసేటప్పుడు మాట్లాడకూడదు..నడువ్..నడువ్" అని ఆయన కసరడంతో ఆ మిత్రుడూ, నేనూ సిగ్గుతో చితికిపోయాం. 'ఈయనకు ఏదయినా ధ్యాసపడిందంటే అదే ధ్యాన తప్ప ఎదుటిమనుషులు, మర్యాదా, మన్ననా ఇవేం కనబడవు' అని విసుక్కున్నాను నాలో నేనే. ఇంటి కొచ్చేసరికి అలవాటు లేనిపని కావటంవల్ల కాళ్ళు నొప్పిపుట్టడం మొదలెట్టాయి. సోఫాలో కూర్చుని ఎవరి కాళ్ళను వాళ్ళమే వత్తుకుంటూ అలా కొంతసేపు సేదదీరి ఆ తర్వాత తిండి కార్యక్రమానికి ఉపక్రమించాం. రోజూ కంచంనిండా అన్నం, పప్పు, కూర, పచ్చడి, పులుసు, పెరుగు వేయించుకుని లాగించే మావారికి చిన్న అప్పడాల సైజులో వుండే రెండు పుల్కాలు, పప్పు, నీళ్ళ మజ్జిగతో సరిపెట్టుకోవలసి రావటంతో అంతటి పొట్టలో అవి ఏ మూలకూ రాక ముఖం మాడిపోయిన బల్బులా చిన్నపోయింది. అయినా డాంబికం మాత్రం వదలలేదు. సాయంత్రం నాలుగు గంటలకు చిరుతిండ్లు తినటం వల్ల నా పరిస్థితి మాత్రం భేషుగ్గానే వుంది. దాంతో హాయిగా నిద్రపోయాను.

అర్ధరాత్రి ఏదో చప్పుడు కావటంతో దిగ్గున లేచి కూర్చుని ఆలకించాను. సన్నగా ఏవో శబ్దాలు..మంచం దిగి మెల్లగా బెడ్‌రూమ్ తలుపుతీసుకుని బయటకు వచ్చాను. హాల్లో నిశ్శబ్దం..కిచెన్‌లో జీరో బల్బు వెలుగుతూ కనిపించింది. అటు వెళ్ళాను. ఆశ్చర్యం! మావారు కంచంలో అన్నం వడ్డించుకుని అక్కడే వున్న చెక్క కుర్చీమీద కూర్చుని ఆవురావురుమంటూ తింటున్నారు. ఆ సీన్ చూసి నాకు చచ్చేంత నవ్వు వచ్చింది. ఆ సమయంలో ఇంక ఏం మాట్లాడినా బాగుండదని నేను మౌనంగా వుండిపోయాను.

మళ్ళీ పొద్దున్నే లేస్తూ ఆయన 'కాఫీ..కాఫీ' అనటానికి బదులు "మొలకెత్తిన పెసలు..సిద్ధం చేసావా?" అనటం నాకు ఆశ్చర్యం వేసింది. ప్లేట్‌లో తెచ్చి ముందు పెట్టాను. స్పూన్ తీసి పక్కన పెట్టి పిడికిలితో పెసలు బొక్కటం మొదలుపెట్టారు. ఆ తర్వాత అరకప్పు లైట్ 'టీ' తాగి అలాగే ఆఫీస్‌కి వెళ్ళిపోయారు.

'పాపం!' అనిపించింది. రోజూ అరడజను ఇడ్లీలో, మూడు దోసెలో- చట్నీ, కారప్పొడి, సాంబారుతో కలిపి లాగించి బ్రేవ్‌మని తేన్చుకుంటూ ఆఫీసుకెళ్ళే మనిషి ఆరోజు మాత్రం తోటకూర కాడలా వేళ్ళాడుతూ, చిన్నబోయిన ముఖంతో వెళ్ళిపోయారు. ఆ తరువాత, రాళ్ళయినా అరిగించుకునే వయసులో ఆ అరకొర తిండి అంతటి మనిషినీ పిచ్చుకలా మార్చి ఆయన సహనానికి పరీక్ష పెడుతోందనీ..ముఖం వేళ్ళాడేసుకుని, కాళ్ళీడ్చుకుంటూ ఆ సాయంత్రం ఆఫీసు నుంచి ఆయన ఇంటికి వచ్చిన వైనం చెప్పక చెప్పింది. నేను మాత్రం యథాప్రకారం నా బ్రేక్‌ఫాస్ట్, లంచ్ చేసేయటం

## బిజీ భూమిక

అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది భూమిక. రాజ్‌కుమార్ సంతోషి కొత్త చిత్రం షూటింగ్‌లో ఈభామ బిజీగా గడుపుతోంది. అక్షయ్‌కుమార్‌తో కలిసి నటిస్తున్న ఈచిత్రం ఈ నెలాఖరుకి షూటింగ్ పూర్తిచేసుకుని జనం ముందుకి రాబోతోంది. 'ఈ చిత్రం తర్వాత నాకు బోలెడన్ని ఆఫర్లు వస్తాయి. నా పెర్ఫార్మెన్స్ చాలా బాగుంటుంది' అంటోంది భూమిక. అన్నట్టు ఈమె అందం ఇప్పుడు బాగా పెరిగినట్టు ఉంది.



వల్ల...అంత వైనంగా ఆయన్ని గమనించే ఓపికను కలిగి వున్నాను. ఆయనదంతా ఆరంభశూరత్వమనీ, దేనికయినా వోవర్‌గా రియాక్టయి చాదస్తంలోకి దిగిపోయే ఆవేశస్వభావమనీ తెలిసిందాన్ని గనుక మౌనంగా ఆయన్ని అబ్జర్వ్ చేస్తూ వుండిపోయాను. అలా రెండు రోజులు సాగిపోయింది ఆయన డైటింగ్ ప్రక్రియ.

ఆ రోజు ఆదివారం.

సన్నగా జల్లుపడుతోంది.

మావారికి ఉల్లిపాయ పకోడీలంటే ఇష్టం గనుక..సడన్‌గా అవి చేయాలన్న ఆలోచన వచ్చి వంటింట్లోకి వెళ్ళాను. ఆయనకు ఇష్టమైనవి వండిపెట్టడం అంటే నాకు చాలా ఇష్టం.

ఘుమఘు వాసనలు బెడ్‌రూమ్ వరకూ వ్యాపించాయేమో పడుకున్న మనిషల్లా చటుక్కున లేచొచ్చారు "ఏం చేస్తున్నావ్?" అంటూ.

చేస్తున్న వంటకం చూసి "ఆయిల్ పదార్థాలు చెయ్యొద్దని చెప్పానా?" అని నామీద ఒక్క అరుపు అరిచారు.

"అయ్యో! మీరు తినరు కదా ఇవి..మర్చిపోయి చేసాను" అంటూ రెండు వాయల పకోడీలు చేయగానే స్టౌ ఆర్పేసి నా వంతు నేను ప్లేట్‌లో పెట్టుకుని నిమ్మకాయ కారం నలుచుకుంటూ వేడి వేడిగా తినసాగాను. "అబ్బ! ఎంత బాగున్నాయో" అని కూడా అన్నాను అనుకోకుండానే. ఆయన పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని "కొంచెం తినండి. ఒక్కరోజుకి ఏమీ కాదు" అని బ్రతిమిలాడుతానేమో అని చూసారు. నేనలా అనకపోవటంతో ఆయనకు సహనం చచ్చిపోయింది. 'పకోడీలు చల్లారిపోతాయి ఆలస్యం చేస్తే' అన్న భయం ఒకటీ. "ఏదీ నాకూ కొంచెం పెట్టు..చాలా కొంచెం..ఎక్కువ వద్దు" అన్నారు చిట్టచివరకి. ఆయన మనసాపుకోలేక పోతున్నారని గ్రహించి..బోలెడు జాలేసి..అడిగిందానికన్నా ఎక్కువే పెట్టాను. అవి నిముషంలో తినేసి...ఏదీ మరో రెండు పెట్టు అన్నారు. గిన్నెలోవి మొత్తం వేసేస్తుంటే "ఇంత తక్కువ చేసుకున్నావేం?" అని కూడా అన్నారు డైటింగ్ సంగతి అప్పటికప్పుడే మర్చిపోయి. నాకు నవ్వు వచ్చినా పంటికింద బిగబట్టి వుంచాను. మొత్తానికి ఎలాగయితేనేం ఆ రోజుకు ఆయనకు వ్రతభంగం అలా కానిచ్చేసాను.

"రాత్రికి నాకేమీ చెయ్యొద్దు తినటానికి" అన్నారు వాష్‌బేసిన్‌లో చెయ్యి కడుక్కుంటూ. 'ఆరేడు గంటల తరువాతి సంగతి కదా' అని మనసులో అనుకుని, పైకి "అలాగే" అన్నాను అమాయకంగా ముఖం పెట్టి.

ఆ సాయంత్రం బూరెల్లా పొంగిన పాదాల వంక చూసుకుంటూ మావారు "వాకింగ్ కాస్త ఎక్కువవుతున్నట్లున్నది. కాళ్ళు వాచాయి. కాస్త తగ్గిస్తాను ఈరోజు నుంచీ" అన్నారు. ఆరోజు అలా అన్న మనిషి రోజుకు కాస్త కాస్త చొప్పున తగ్గిస్తూ..ఆ తరువాత పూర్తిగా మానేసారు. డైటింగ్ సంగతీ డిటోనే.

నాకు ప్రాణం కాస్త కుదుటపడ్డట్టయింది. కానీ ఏం లాభం?

ఆరోగ్యం గురించిన ఆరాటం తగ్గాక మళ్ళీ మొదటి కొస్తూ పరిశుభ్రత గురించి పాఠాలు మొదలుపెట్టారు. అందులో ఆయనకు పోయిందేమీ లేదుకదా నా ఖర్మతినటం తప్ప. అందులోనూ ఇన్నిరోజులూ డైటింగ్ చేసి ఆకలి మీద ఉన్నారేమో కరకరా నమిలేయటం మొదలు పెట్టారు అప్పుడంలా నా మెదడును.

ఆరోజు ఓ గమ్మత్తయిన సంఘటన జరిగింది. వంటింట్లో ఎక్కడో ఏదో మూల ఓ 'కాక్రోచ్' కనిపించిందట. చీపురుకట్ట తీసుకుని దాని వెంట పడుతూ 'పెడీ పెడీ'మని ఇల్లెగిరిపోయేలా దెబ్బలు శబ్దాలు చేస్తూ చివరకు కాలికేదో తగిలి బొక్కాబోర్లా పడ్డారు. కంగారుగా దగ్గరికి పరుగెత్తి నేను చెయ్యి అందించి లేపటానికి ప్రయత్నిస్తే..అలనాడు మయసభలో దుర్యోధనుడికి జరిగిన అవమానం లాంటిదే తనకూ జరిగినట్లుగా ఫీలయి విలవిలలాడిపోతూ-"అంతా నీ మూలంగానే! వంటిల్లు శుభ్రంగా పెట్టుకోవడం రాని నువ్వేం ఆడదానివి" అంటూ నిప్పులు చెరుగుతూ నా వంక చూసారు.

ఒక పక్క నాకు నవ్వు వస్తోంది. మరోపక్క ఆయన పరిస్థితికి జాలివేస్తోంది. అయినా అతికష్టం మీద మౌన వ్రతం పాటిస్తూ బెణికిన ఆయన మడమకు జండూ బామ్ రాస్తూ కూర్చున్నాను. కొంతసేపటికి 'కాలు'తోపాటు 'ఆయనా' నార్మల్ అయిపోయారు. 'ఈ మనిషిని ఈ చాదస్తపు ధోరణి నుంచి డైవర్ట్ చేసి హాపీ మూడ్‌లోకి తీసుకొని రావాలంటే..రెండు రోజులుగా చెప్పాలనుకుంటున్న ఆ గుడ్‌న్యూస్ చెప్పెయ్యాలి. ఆ సంతోషంలో ఈయన చాదస్తాలు కాస్త అడుగంటి పోవచ్చు' అనుకుంటూ "ఏమండీ! మీకో శుభవార్త. మీరు త్వరలో తండ్రి కాబోతున్నారు" అన్నాను, సిగ్గుతో కళ్ళు వాలిపోగా. అయినా ఆయన రియాక్షన్‌ను, ఆ ఆనంద పారవశ్యాన్ని చూడాలన్న ఆరాటం ఆపుకోలేక తలెత్తి ఆయన వంక చూసాను. "అవునా! అయితే గర్భిణీస్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పిల్లలపోషణ..వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి నువ్వు. రేపే నీకు బోలెడు పుస్తకాలు కొనుక్కొచ్చి ఇస్తాను చదువు" అన్నారు.

'హతోస్మి! రేపటినుంచీ ఈయన్ని కంట్రోలు చేయడం మరీ కష్టం!' అనుకున్నాను తలపట్టుకుంటూ.

## నృత్యరాణి

**సినిమా ఫంక్షన్స్‌లో పాల్గొనడానికి తారలు ఎంతో ప్రాధాన్యత చూపిస్తారు. తారల తళుకుబెళుకులు ఇక్కడ బాగా దర్శనం ఇస్తాయి. అయితే అందరితారల్లా కోయినామిత్రా మొన్నామధ్య ఓ ఫంక్షన్‌కి హాజరైంది. ఇక్కడ విశేషం ఏముంది అంటారా? అక్కడే ఓ విశేషం ఉంది. ఆమె అటెండ్ అయ్యింది ఓ సంగీత కార్యక్రమంట. ఆమెకి ఎక్కువగా అభిమానించే శివమణి సంగీత కార్యక్రమానికి హాజరవ్వడమే కాదు, ఆ కార్యక్రమంలో ఆమె డాన్స్ చేసిందట.**

